# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 48 | వరంగల్ | శుక్రవారం, 31 అక్టోబర్ 2025 | పేజీలు : 03




## ముంపు ప్రాంతాల్లో సీపీ పర్యటన

- వరద సహాయక చర్యల్లో ఓరుగల్లు పోలీసులు

2

## సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** డిప్యుటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ వేముల శ్రీనివాసులు, డీజీపీ శివధర్ రెడ్డి, HMWSSB ఎండీ అశోక్ రెడ్డి పాల్గొన్నారు. జనగామ కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఆర్డీవోలు, వ్యవసాయ, విద్యుత్, సివిల్ సప్లై తదితర శాఖ లకు చెందిన అధికారులు హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ.. వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తామని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలన్నారు. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన ఇతర శాఖల సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.



# రైతులు అధైర్య పడొద్దు

- క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తం గా ఉండాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**పాలకుర్తి వాణి, జనగామ :** అకాల వర్షా ల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, జిల్లాలో ఎలాంటి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. రఘునాథ్ పల్లిలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం పరిశీలించి నీటి వరద నివారణకు తీసుకోవాలిసిన చర్యలను అధికారులకు తెలిపారు. నిడి గొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి.. రైతులు అధైర్య పడవద్దని తెలిపారు. డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.




WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





# నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

- వరద పరిస్థితిని పరిశీలించిన యశస్విని రెడ్డి
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచన

**పాలకుర్తి వాణి, ప్రత్యేక ప్రతినిధి :** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో వరద పరిస్థితిని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్వయంగా పరిశీలించారు. పాలకుర్తి, తొర్రూరు, పెద్దవంగర కొడకండ్ల మండలంలో పర్యటించారు. పరిస్థితిపై ఆరా తీశారు. పాలకుర్తి నాంచారి మదూరు, పెద్ద వంగర ఉప్పరగూడెం, తొర్రూరు అమ్మాపురం గుత్తురు రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు ఉదృతి తగ్గే వరకు రాకపోకలు కొనసాగించొద్దని కోరారు. మహబూబాబాద్, జనగామ జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురుస్తుండగా.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వెంటనే అధికారులను వెంటబెట్టుకొని పలు మండలాల్లో పర్యటించారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలని, ఎక్కడైనా రోడ్లు తెగిపోయినా, చెరువులు పొంగిపోయినా వెంటనే రిపోర్ట్ ఇవ్వాలన్నారు. అదే విధంగా వర్షాల కారణంగా రైతులు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు, గ్రామీణ రహదారుల వద్ద నీరు నిల్వ కాకుండా చూడాలని సూచించారు. పాలకుర్తి మండలం హరిజన కాలనీలో పర్యటించి బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



పాలకుర్తి - నాంచారి మదూరు రోడ్డుపై వరద నీరు ఉదృతి



వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన..

# తుఫాన్ తో పంటలకు అపార నష్టం

## నేలకొరిగిన వరి, మొక్కజొన్న, పత్తి

**పాలకుర్తి వాణి, ప్రత్యేక ప్రతినిధి :** తుఫాను ప్రభావంతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. పాలకుర్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీరా పరశురాం నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి సింగారపు కరుణాకర్ ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులతో ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. బమ్మెర, పాలకుర్తి, లక్ష్మీనారాయణపురం, విస్నూరు గ్రామాలను సందర్శించారు. వరి సుమారు 3765 ఎకరాలలో, పత్తి పంట 2002 ఎకరాలు, మొక్కజొన్న 133 ఎకరాలు, ఇతర పంటలు 22 ఎకరాలు లలో నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక నిర్ధారణలో తేలిందన్నారు. అధికారులు మన్యపు దీపక్, ముత్తినేని వెంకటేష్, సంకటబోయిన మహేష్, రైతులు పాల్గొన్నారు. వర్ర వెంకన్నకు చెందిన 20 ఎకరాల వరి పంట నేలకొరిగింది.









# ముంపు ప్రాంతాల్లో సీపీ పర్యటన

**పాలకుర్తి వాణి, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ నగరాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నిట్ట మునిగిన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో గృహ నిర్బంధమైన ప్రజల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

# పేదింటి కుటుంబానికి సహాయం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన అంధుడు మారోజు రవీంద్ర చారి ఉపేంద్ర దంపతుల కూతురు వివాహాము ఈనెల ఒకటో తేదీన జరగనున్నది. ఆ నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్ బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు



# ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**పాలకుర్తి వాణి, పెద్దవంగర :** పెద్దవంగర మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లి కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలో 13300 ఎకరాలలో వరి పంట సాగుచేయగా ప్రస్తుతం కొంత పాలు పోసుకే దశలో ఉండగా, చాలావరకు కోత దశలో ఉంది.



## ప్రభుత్వం ఆదుకోవాలి



**ఐదు ఎకరాలలో 1271 రకం వరి సాగుచేశా. మరో నాలుగు రోజుల్లో కోత చేద్దామనుకున్న తరుణంలో తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షా లకు మూడు ఎకరాలలో పంట పూర్తిగా నేలవాలి నష్టం వాటిల్లింది. ఆకాల వర్షా లకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.**

- ఎదునూరి స్వప్న, పెద్దవంగర

## పంటంతా నేలకొరిగింది

**ఏడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని నాలుగు ఎకరాలలో వరి సాగుచేశా. వర్షలకు మూడు ఎకరాల్లో పంట మొత్తం నెలవాలింది. పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారులు పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలి.**

**చెరుకు యాకయ్య, కౌలురైతు, పెద్దవంగర**





# చినుకు పడితే చిత్తడే..

- **15 కుటుంబాలకు దారి ఇబ్బందులు**
- **ఉన్న మట్టి రోడ్డుపై నడవలేని పరిస్థితి**
- **సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్**

**పాలకుర్తి వాణి, పాలకుర్తి టౌన్:** పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది పాలకుర్తి పట్టణంలోని పలు కాలనీల పరిస్థితి. తుఫాను ప్రభావంతో జోరుగా వర్షాలు పడుతున్నాయి. పోతన జూనియర్ కాలేజీ సమీపంలోని వీధులను వరదనీరు ముంచెత్తింది. ఏకంగా పదుల సంఖ్యలో నివాసాల్లో నీళ్లు చేరగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడమే కారణమని ప్రజలు వాపోతున్నారు.

**మట్టి రోడ్డుతో స్థానికుల అవస్థలు**

పోతన కాలేజ్ సమీపంలోని ఇండ్లకు వెళ్లే మట్టి రహదారి అధ్వానంగా మారింది. నీళ్లు చేరడంతో స్థానికులకు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఇండ్ల నుంచి బయటకు వెళ్ళలేని దుస్థితి నెలకొంది. రహదారులపై మోకాలలోతు నీరు ప్రవహించింది. స్థానికులు బయటకు రావడానికి, నిత్యవసర సరుకులు కొనడానికి సైతం అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కాలనీలో ఉన్న మట్టి రహదారి పరిస్థితి ఇలాగే ఉండడంతో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సిసి రోడ్డు వల్ల రాకపోకలు కొంతమేర సజావుగా సాగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సిసి రోడ్డు ఏర్పాటు పై చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇక ఆయా ప్రాంతాల్లోని పలు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, మురుగు కాలువలు లేకపోవడంతో స్థానికులు ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పంచాయతీ పాలకులు మురుగు కాలువల నిర్మాణాలు సిసి రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలు

- **మత్తడిలో 110 గొర్రెలు మృతి**
- **సుమారు రూ.10 లక్షల వరకు నష్టం**
- **రోడ్డున పడిన గొర్లకాపర్లు**

**పాలకుర్తి వాణి, నర్మెట్ట :** చెరువు మత్తడి ఉద్రుతమై సుమారు 110 గొర్రెలు గల్లంతై మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్దండ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన పంతెంగి చంద్రమౌళి 110 గొర్రెలు, వడాల పెద్దపురంకు చెందిన 150 గొర్రెలను కొట్టుకొని గంటెమ్మ చెరువు సమీపంలోకి వెళ్లారు. ఈ క్రమంలో వర్షం వర్షంఎక్కువై చెరువులు నిండిపోయాయి. దీంతో సాయంత్రం ఎప్పటిలాగే తమ గొర్రెలను ఇంటికి తీసుకువస్తుండగా గంటెమ్మ చెరువు మత్తడి ఉదృతమవడంతో గొర్రెలు అన్ని మత్తడిలో కొట్టుకుపోయాయి. నీటిలో గల్లంతై సుమారు 110 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. దీంతో గురువారం ఉదయం గ్రామస్తులు మృతిచెందిన గొర్రెలను బయటకు తీసి రెవెన్యూ; వెటర్నరీ అధికారులకు సమాచారం అందించగా వెంటర్నరీ వైద్యుడు జితేందర్ పోస్టుమార్టం నిర్వహించారు. తమ జీవనాధారమైన తమకు సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. నష్టపోయిన గొర్లకాపర్లకు నష్టపరిహారం అందించాలని గొర్లకాపర్ల సంఘం సభ్యులు తహసీల్దార్లకు వినతిపత్రం అందించారు.



# పాలకుర్తిలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని నానకరంగూడలో ఉన్న శంకర్ కంటి ఆసుపత్రిని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులతో సమావేశమై, పాలకుర్తి నియోజకవర్గంలో చేపట్టనున్న ఉచిత కంటి పరీక్షా శిబిరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, ముఖ్యంగా పేద మరియు గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి సంబంధిత వైద్య సేవలను అందించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమం పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి నేతృత్వంలో, శంకర్ ఐ ఫౌండేషన్ సహకారంతో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడనుందని వెల్లడించారు. ఈ కంటి పరీక్షా శిబిరాల ద్వారా నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, కంటి కళ్ళజోడుల పంపిణీ, అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయడం జరుగుతుందని ఆమె వివరించారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం మా ఫ్యామిలీ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోంది. శంకర్ ఐ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది లబ్ధి పొందుతారని విశ్వసిస్తున్నాను అని తెలిపారు.



# రైతులను ఆదుకోవాలి

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పాలకుర్తి మండలం లో కురిసిన తుఫాను వర్షం వల్ల నష్టపోయిన పంటలను పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి తో కలిసి ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాలకుర్తి మండల డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.మాచర్ల ఎల్లయ్య,కారుపోతుల వేణు, కడుదుల కరుణాకర్ రెడ్డి,నక్క నాగయ్య, పులి ఐలోని, గుండె రాములు,కత్తి సైదులు, సోమేశ్వరరావు, రాజేంద్ర చారి, కోల నారాయణ, శాంతయ్య,రాము, రాజుమొహమ్మద్ వెంకటేశ్వర్లు,సాయి ఉన్నారు.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రచార జోరు

- **మంత్రులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఝాన్సీ రాజేందర్ రెడ్డి**

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వేడి పెరిగింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కూడా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్, బోరాబండ, యూసూఫ్‌గూడ ప్రాంతాల్లో ప్రచారంలో నేతలు ప్రజలను నేరుగా కలసి, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఓటు వేయాలని కోరారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈసారి ప్రజల తీర్పు కూడా కాంగ్రెస్‌కే వస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ సభ్యులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341